# అంటూ వుంటే బద్ధమిత్రులు

ఆ సాయంత్రం గవరయ్యని చంపెయ్యడానికి నిశ్చయించుకున్నాడు హరిశ్చంద్రుడు. పొలంపక్క, చెఱువు గట్టున, మామిడి చెట్టుకింద వైకుంఠపాళీ ఆటకి కూర్చుంటారు. కూర్చునేచోట ముళ్ళు పెడతాడు. గవరయ్యకి గుచ్చుకుంటుంది ముల్లు, రక్తం కారుతుంది. తను జేబులోంచి సీసాతీసి మందు వేస్తాడు. అది మందుకాదు, పాము విషం, చస్తాడు, తీరిపోతుంది.

నెలక్రితం పాములవాడి దగ్గర విషంసీసా సంపాదించాడు తిరణాల కెళ్ళినప్పుడు. ఇంక ఆచరణలో పెట్టడం తరువాయి.

గవరయ్య పనిపిల్లని పంపించాడు. దాని పేరు తాయారు. రెండు నెలలు తనింట్లో పనిచేసింది. "ఎక్కువ ముట్ట చెబుతానని మభ్య పెట్టి తనింట్లో పనికి కుదుర్చుకున్నాడు గవరయ్య." అతన్ని చంపాలన్న నిశ్చయానికి వందలాదిగా వున్న కారణాలలో ఇదొకటి తాయారు. చీటీ ఇచ్చింది. చదువుకున్నాడు హరిశ్చంద్రుడు. అందులో ఇల్లా వుంది.

"నాకు జీవితంమీద మోహం మొత్తింది. చావడానికి నిశ్చయించుకున్నాను. నాకు నువ్వొక్కడివే స్నేహితుడవు గనక ముందుగా చెప్పి వేస్తున్నాను. దీనివల్ల నేను సుఖపడతాను; ముఖ్యంగా నువ్వు సుఖపడతావు. నీ దగ్గర గరళం వుందిట! ఆ సీసా పంపు. నీమేలు మరవను— బ్రతికున్నంత వరకూ. ఇట్లు గవరయ్య."

చిన్న సీసాలో తేనెపోసి తాయారుకిచ్చి పంపించాడు హరిశ్చంద్రుడు.

తను తలపెట్టిన హత్యాకాండ జరపడానికి వీల్లేకుండా పోయింది. తన దగ్గర విషం సీసా వున్నట్లు "గవరయ్యకి ఎట్లా తెలిసిందో."

నవ్వుకున్నాడు హరిశ్చంద్రుడు. గవరయ్య కొంతకాలం బ్రతకడమే మంచిది. అతను చచ్చిపోతే. చంపేటందుకు ఇంకెవ్వరూ వుండరు తనకి. ఈ చంపాలన్న ఆలోచనలే అతనికి ప్రస్తుతం కాలక్షేపం."

తాయారు మళ్ళా వొచ్చి మరో చీటి తెచ్చింది. అందులో ఇల్లా వుంది.

"మనిద్దరము కలిసి ఈ రాత్రి భోజనం చెయ్యాలి. ఇదే ఆఖరు భోజనం చెఱువుగట్టున వైకుంఠపాళి ఆడుకుందాం ఆఖరు ఆట, ఆరింటికే రా. ఆఖరు కోరిక. ఇట్లు గవరయ్య."

'సరే వొస్తానని చెప్పు' అని తాయారుని పంపించాడు హరిశ్చంద్రుడు.

మధ్యాహ్నం మూడైంది. గవరయ్య దగ్గరకి వెళ్ళేటందుకు ఇంకా మూడు గంటలు వ్యవధి వుంది. కాసేపు వెన్ను వాల్చాడు హరిశ్చంద్రుడు. నిద్ర పట్టలేదు.

గవరయ్య తనకంటె రెండేళ్ళు చిన్న. ఇద్దరూ వీధిబడి మేష్టర్లు. గవరయ్య తనకంటె ఏడాది సీనియర్: తనకంటె ఆరురూపాయలు జీతం ఎక్కువ. తనకంటె ఎకరంభూమి ఎక్కువుంది. మనిషి మరో అంగుళం ఎత్తు. తనకి ఆడపిల్లలు లేరు. అతనికి ఇద్దరాడపిల్లలు. సంతానం ఇద్దరికీ సమానమే. అదో సుగుణం. గవరయ్యభార్య రాధ. తనకిస్తామని వచ్చారు- అబ్బో! ఇరవైఏళ్ళనాటి మాట, రాధ బాగుంటుంది- ఆ రోజుల్లో తనకి నచ్చింది. ఆ సంబంధం కుదిరితే బాగుండుననుకున్నాడు. దేవుడికి మొక్కుకున్నాడు. మరి ఏం తిరకాసొచ్చిందో తనకి తెలీదు. అతని కప్పుడు పదిహేడో ఏడు. ఆ సంబంధం బెసికిపోయింది. గవరయ్య రాధని చేసుకున్నాడు. రాధ జుట్టు నెరవడంలేదు. తన భార్య తల ముగ్గుబుట్ట. పోనీ, గవరయ్య కూతురు 'కర్పూరాన్ని' - అదేం పేరో! వాళ్ళబ్బాయికి ఇవ్వొచ్చుగా. ఈడూ, జోడూ బాగుంటుంది. పై ఊరు మునసబుతో వియ్యమొందాడు గవరయ్య: ఈ మాత్రం పిల్ల తనికి దొరక్కపోతుందా! తనకి

అంటే తన కొడుక్కి! కర్పూరంది కాస్త మెల్ల కన్నేనేమో! అంటుంది తన భార్య. ఉదయం రెండుగంటలు ఇద్దరూ బడిలో పాఠం చెబుతారు. గవరయ్య 'హెడ్డు' - తను చిన్నయ్యవోరు - అసిస్టెంటు. ఇద్దరి పొలాలు పక్క పక్కనే, మధ్య గజం వెడల్పు గట్టూ, తను నడవకుండా పల్లేరు పోస్తాడా! తనని ఆడిపోస్తాడు గవరయ్య. మళ్ళీ సాయంత్రం చెబువుగట్టున వైకుంఠపాళికి రమ్మంటాడు. ఎప్పుడూ తనే వోడిపోతాడు. గవరయ్య నిచ్చెనలు ఎక్కుతుంటాడు. తను పాము నోట్లో పడుతుంటాడు. తను బీడీలు కాలిస్తే, గవరయ్య చుట్టలు మొదలెట్టాడు. తను మానేశాడు. గవరయ్య మానేశాడు. ఎందులోనూ తనకి ఆధిక్యంలేదు. గవరయ్య చస్తే, బడికి తను హెడ్డు అవుతాడు. అదొక్కటే చాలు. అందుకనే చంపడం. పాము నోట్లో పడుతున్నది తను. గరళంతో గవరయ్యని చంపడమే తగిన శాస్తి.

కాని తనే చస్తానని చీటీ పంపాడు గవరయ్య. ఏమొచ్చింది? జీవితంమీద ఎందుకు మొహం మొత్తిందో? ఇదంతా నాటకం. రాత్రి భోజనానికి ఎందుకు పిలిచినట్లు? తనకి విషంపెట్టి చంపడు కదా?

నాలుగు నెలలుగా ఇద్దరికీ మాటలు లేవు. కరణం కూతురికి పరీక్షలో సున్నా మార్కులు వేశాడు హరిశ్చంద్రుడు. తను మళ్ళా పూనుకుని, ఇరవై మార్కులిచ్చాడు గవరయ్య - కరణం దగ్గర అరటిగెల లంచం పుచ్చుకుని. ఇది బైటపెట్టాడు తను. కాని ఏం లాభం? తన భార్య, మునసబు కొడుకు దగ్గర చింతపండు తీసుకుంది. మార్కు లేయిస్తానని. దానికి దీనికి చెల్లు పొమ్మన్నాడు గవరయ్య. ఛీఛీ - వెధవ బ్రతుకు. చావడం మంచిది. సీసా తీశాడు. విషం తాగితే తీరిపోతుంది? కాని పెళ్ళాం, పిల్లలు - వాళ్ళ గతేంకాను? సీసా పంచె వ్డాడిలో పెట్టుకుని, పైన తువ్వాలు వేసుకుని, గవరయ్య ఇంటికి బైలుదేరాడు హరిశ్చంద్రుడు.

హరిశ్చంద్రుడు వందగజాలు నడిచాడు. ఎదురుగా వొక మనిషి వొస్తున్నట్లు అతను చూడనే లేదు. ఆ మనిషిది వామనదాయు: ఎదిగిన గడ్డం - బాగా నెరసింది. మెడ కిందికి జారిన గిరజాల జుట్టు: అక్కడక్కడ చిరిగిన తెల్ల చొక్కా; ఖద్దరు పంచిగూడా కట్టి, పైన శాలువాలా కప్పుకున్న కండువా - ఆకు జోళ్లు, అదీ వాలకం. హరిశ్చంద్రుణ్ని దాటి, ఆ వ్యక్తి వెనక్కి తిరిగి, అతనికి అడ్డంగా నుంచున్నాడు. అతన్ని తొలిగించుకొని నడవబొయ్యాడు హరిశ్చంద్రుడు. బుజంపైన చెయ్యి వేసి 'నిలిపాడు ఆ వ్యక్తి. కొత్త మొహం - ఇదివరకెన్నడూ ఆ ఊళ్ళో చూసిన మనిషి కాడు. రాత్రికి భోజనం ఏర్పాటు చెయ్యమన్నాడు. అతన్ని తప్పించుకొని నడవబోయాడు. కాని ఆ వ్యక్తి అటకాయించాడు. వృద్ధుడు-బోసిగా నవ్వుతున్నాడు. తెలుగు కాస్తంత తమిళయాసతో మాట్లాడతాడు. పేరు "తంబి"ట! మళయాళం. తెనుగు, కన్నడ, తమిళ భాషలొచ్చుట. బాటసారిట - దేశం చూసి రావాలని యాత్రకి బైలుదేరాడట.

ఏమన్నా ముట్టచెబితే, హరిద్వారంలో పెరుమాళ్‌కి అందజేస్తానన్నాడు. హరిశ్చంద్రుడికి వో భావం స్ఫురించింది. "ఈ ఊళ్ళో గవరయ్య అనే సంపన్నుడు, పెద్దమనిషి వున్నాడు. ఉదారుడు; ఆయన సతీమణి ఉత్తమురాలు, అన్నపూర్ణాదేవి. అక్కడికి వెళ్ళితే లాభిస్తుంది." అన్నాడు.

అక్కడినుండే వస్తున్నానన్నాడు "తంబి" - విరగబడి నవ్వుతూ. పై వరసలో ముందు పళ్ళు రెండు లేవు. వికృతంగా ధ్వనించినా ఆ నవ్వు రోత పుట్టదు - నవ్వుతుంటే ఇంకా చూడబుద్ధేస్తుంది.

"ఏం జరిగింది ?"

"ఈ ఊళ్ళో దగ్గర్లోనే హరిశ్చంద్రుడనే సంస్కారి, మర్యాదస్తుడు, జాలిగుండెగల ఆసామీ వున్నాడు. అక్కడికి వెళ్ళమన్నాడు" అన్నాడు తంబి.

